నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 12 అక్టోబర్ 2024 | MEDAK

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 11: విజయ దశమి పర్వదినం సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజలకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి అన్నింటా శుభం చేకురాలని, ప్రజల జీవితంలో దసరాను మించిన పండుగ లేదన్నారు. దసరా పండుగలో మన సంప్రాదాయం, సంస్కృతితో పాటు ఆత్మీయత మిళితమై ఉందన్నారు. ఈ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడు ఎంత శక్తి వంతంగా కనిపిస్తున్నా, చివరికి మంచితనమే విజయం సాధిస్తుందని, దసరా పండుగ దీనిని గుర్తు చేస్తుందన్నారు. చెడుపై మంచి విజయం సాధించిన రోజు విజయ దశమి అన్నారు. విజయ దశమి రోజు పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజల దీవెన ఎల్లప్పుడు ఉండాలని, ఈ దసరా మారిన్ని విజయాలను అందించాలని కోరుకుంటున్నట్లు ప్రకటనలో తెలిపారు.

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేస్తాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- తంగళ్లపల్లిలో ఇంటగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ

కోహెడ, అక్టోబర్ 11: సర్కారు విద్యావ్యవస్థను మెరుగుపర్చేందుకు రాష్ట్రంలో 10వేల ఉపాధ్యాయ పోస్టులను నియామకం చేసి పత్రాలు అందించామని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణానికి అడిషనల్ కలెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం విద్యావ్యవస్థ మెరుగు పరిచేందుకు 10వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందని, కోట్లాది రూపాయలతో పాఠశాలలను మెరుగుపర్చామన్నారు. విద్యాసంవత్సరం మొదలయ్యేలోగా యంగ్ ఇండియా ఇంటగ్రేటెడ్ గురుకుల పాఠశాల ప్రారంభం అవుతుందని తెలిపారు. హుస్నాబాద్‌ను అన్నివిధాలుగా తీర్చి దిద్దుతామన్నారు. ఇంటగ్రేటెడ్ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటగ్రేటెడ్ పాఠశాలకు కోహెడలో స్థలం కోసం అన్వేషన చేయగా తంగళ్లపల్లిలో ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి మంజూరు చేయించినట్లు తెలిపారు. పాఠశాలలో 2500పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తారని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోగా భవనం నిర్మాణం పూర్తయి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో ప్రారంభిస్తానన్నారు. తంగళ్లపల్లి నుంచి బద్దిపడగ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేస్తానని మంత్రి పొన్నం హామీ ఇచ్చా కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో, తహసీల్దార్ సురేఖ, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మంద ధర్మయ్య, గొరిట్యాల లక్ష్మణ్, శ్రీకాంత్, బండిపల్లి నారాయణ, బండమీది రాజమౌళి, భూంపెల్లి సంజీవరెడ్డి, మంద వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ, జయరాజ్, కర్వేద రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు

జహీరాబాద్, అక్టోబర్ 11: దసరా, దీపావళి పండగ సందర్భంగా తిరుపతికి దర్శన నిమిత్తం వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైలు సౌకర్యాన్ని కల్పించినట్టు జహీరాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ తెలిపారు. ఈనెల 13,20,27, నవంబర్ 3వ తేదీల్లో జాల్నా నుంచి తిరుపతికి వెళ్లేందుకు ప్రత్యేక రైలు (07621) సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. తిరుపతి నుంచి జాల్నాకు రైలు(07622) ఈనెల 14,21,28, నవంబర్ 4వ తేదీన వస్తుందన్నారు. ఈ ప్రత్యేక రైలు జాల్నా నుంచి బీదర్, జహీరాబాద్, వికారాబాద్ స్టేషన్‌ల మీదుగా తిరుపతికి రాకపోకలు సాగిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని దక్షిణమధ్య రైల్వే అధికారులు సూచించారు.



జోహెన్నెస్‌బర్గ్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

జోహెన్నెస్‌బర్గ్ బతుకమ్మ వేడుకల్లో రసమయి

బెజ్జంకి, అక్టోబర్ 11: దక్షిణాఫ్రికాలోని జోహెన్నెస్‌బర్గ్‌లో టాసా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ, దసరా వేడుకలకు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. అనంతరం టాసాలోని తెలంగాణ ప్రజలు రసమయి బాలకిషన్‌ను ఘనంగా సత్కరించారు.

భారత క్రికెటర్లకు ఈశ్వర్ బౌలింగ్

రింకూసింగ్‌తో ఈశ్వర్

జహీరాబాద్, అక్టోబర్ 11: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం కల్బేమల్ గ్రామానికి చెందిన యువ క్రికెటర్ ఈశ్వర్‌కు ఇండియా క్రికెట్ జట్టుకు నెట్ ప్రాక్టీస్ బౌలింగ్‌కు అవకాశం లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఇండియా-బంగ్లాదేశ్ మధ్య జరిగిన 20-20 క్రికెట్ మ్యాచ్‌లో బౌలింగ్ చేయడానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. 2016లో హైదరాబాద్‌లోని వివేకానంద కళాశాలలో డిగ్రీ చదువుతూ ఈశ్వర్ క్రికెట్ కోచింగ్ తీసుకున్నాడు. పదేండ్లుగా హైదరాబాద్‌లో వివిధ లీగ్ క్రికెట్ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించాడు. క్రికెట్ ఆడుతూనే పలువురు క్రీడాకారులకు కోచింగ్ ఇస్తున్నాడు. గతేడాది ఉప్పల్ స్టేడియంలో ఇండియా-బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య జరిగిన 20-20 క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా టీమ్‌కు తొలిసారి నెట్ ప్రాక్టీస్ బౌలింగ్ చేశాడు.

మాకేవి యంగ్ ఇండియా స్కూల్స్

- మంత్రుల నియోజకవర్గాలకేనా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు మొండిచేయి
- మాకెందుకు ఇవ్వరూ..? ఈ వివక్ష ఏందంటూ అసంతృప్తి
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న విద్యావేత్తలు
- హుస్నాబాద్, అందోల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు శంకుస్థాపన

సిద్దిపేట, అక్టోబర్ 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి):కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను కొన్ని నియోజకవర్గాలకే కేటాయించడంపై విద్యావంతులు, మేధావులు, ప్రజలు పెదవి విరుస్తున్నారు.అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన వీటిని కాంగ్రెస్ మంత్రులు, వారి ఎమ్మెల్యేల నియోజకవర్గాలకే పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు కాగా, శుక్రవారం ఈ స్కూల్స్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్‌ను సుమారుగా 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ స్కూల్స్‌లో 5 నుంచి 12వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో బోధన చేస్తారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తారు. వెలుతురు వచ్చేలా భవనాలు నిర్మిస్తారు. తరగతి గదులు, ల్యాబరేటరీలు, కంప్యూటర్, ఆడిటోరియం, వసతి గృహం, డైనింగ్, కిచెన్, బహుళ వినియోగ హాళ్లు, సిబ్బందికి నివాసగృహాలు, క్లబ్‌లు, వైద్యశాల, ఇండోర్ స్పోర్ట్స్, మైదానాలు తదితర సౌకర్యాలు కల్పించేలా డిజైన్ రూపొందించారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన వాటిని వచ్చే ఏడాది దసరా పండుగ వరకు పూర్తిచేసేలా ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో హుస్నాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, మెదక్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇటీవల పటాన్‌చెరు ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మిగతా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల, అభివృద్ధి పనుల మంజూరు చేయడంలో వివక్ష చూపుతున్నది. ఏడాది నుంచి జిల్లాలో ఇదే తంతు కొనసాగుతున్నది. అన్ని నియోజకవర్గాలను సమానంగా చూడాల్సిన ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. కేవలం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు మంతుల నియోజకవర్గాలకే యంగ్ ఇండియా స్కూల్స్ మంజూరు చేసింది. మిగతా నియోజకవర్గాలకు మొండి చెయ్యి చూపింది. దీంతో ప్రభుత్వ తీరుపై అన్నివర్గాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గురుకులాల సంగతేంటి..?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు నాణ్యమైన, కార్పొరేట్ స్థాయిలో విద్య అందించేందుకు గురుకులాలను నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలతో గురుకులాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ప్రభుత్వం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయడం మంచిదే. కానీ, ఇప్పటికే మండలాల్లో ఉన్న గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు సంగతి ఏమిటి, వీటిపై ఒక స్పష్టతను ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. అన్నివర్గాల వారికి అక్కడ సీట్లు దొరికేవి. ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌లో అందరికీ విద్య దొరుకుతుందా..? అనే ప్రశ్న విద్యావేత్తల నుంచి వ్యక్తమవుతున్నది. ఈ ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. భవిష్యత్తులో వీటి పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాలను, కేజీబీవీలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందించింది. ఇందులో చదివిన విద్యార్థులు అద్భుతంగా రాణించారు. కేసీఆర్ అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తూ గురుకులాలు మంజూరు చేశారు. అభివృద్ధి పనులు మంజూరు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి తిలోదకాలు ఇస్తున్నది మన ఊరు-మనబడి కార్యక్రమం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసింది.ప్రతి మండలంలో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించడంతో ఎంతో మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ తదితర వాటిలో సీట్లు సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను, మోడల్ స్కూల్స్‌ను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతున్నది. పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా చేస్తున్నది.

సిద్దిపేటను విస్మరించడం తగదు..

విద్యాక్షేత్రంగా వర్ధిల్లుతున్న సిద్దిపేటలో యంగ్‌ఇండియా పాఠశాలను ఏర్పాటు చేయాలి. సిద్దిపేటను విస్మరించడం ప్రభుత్వానికి తగదు.సిద్దిపేటలో మెరుగైన విద్య అందుబాటులో ఉండటంతో ఇక్కడ పాఠశాల ఏర్పాటుతో నిరుపేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మేలు జరుగుతుంది. మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే పైలెట్ ప్రాజెక్టు కింద సెలక్ట్ చేయడం సరికాదు. ప్రభుత్వం పక్షపాత ధోరణిని వీడాలి.

– మెర్గు మహేశ్, విద్యార్థి నాయకుడు, సిద్దిపేట

అన్ని ప్రాంతాలకు అవకాశమివ్వాలి..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లోనే ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం తగదు. గజ్వేల్ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం గత ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలను తీసుకొచ్చింది. వాటికి సొంత భవనాలను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయాలి. వేలాది మంది విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో గజ్వేల్ ప్రాంతంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్నారు. వీరిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలి.

–పి.శివకుమార్,
తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

నర్సాపూర్ లేకపోవడం దురదృష్టకరం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయడం హర్షణీయం. నర్సాపూర్ నియోజకవర్గం జాబితాలో లేకపోవడం దురదృష్టకరం. నియోజకవర్గాల ఎంపిక ఏ విధంగా చేశారో అర్థం కావడం లేదు. విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటే నర్సాపూర్ నియోజకవర్గం ముందు వరుసలో ఉంటుంది. ఇక్కడ ప్రభుత్వం స్థలం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు నిర్ణయంచలేదో అర్థమవుతలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేయాలి.

– గుండం మోహన్‌రెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం, నర్సాపూర్

దుబ్బాకపై చిన్నచూపు సరికాదు



దుబ్బాక అంటే ఉద్యమాలతో పాటు విద్యకు ప్రత్యేకత ఉంది. ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరులో దుబ్బాక విస్మరించడం తగదు. సీఎం, మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే తొలి దశలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం మంచిది కాదు. దుబ్బాక నియోజకవర్గ విద్యార్థులపై ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం సబబు కాదు.

– నక్క పరశురాములు, రిటైర్డ్ టీచర్, దుబ్బాక

ప్రభుత్వం పునరాలోచించాలి..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పైలెట్ ప్రాజెక్టుకు మెదక్ జిల్లాను విస్మరించడం బాధాకరం. సువిశాల ప్రాంగణంలో అన్ని వసతులతో ఉండే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేసి ఉంటే మారుమూల ప్రాంతాల బడుగు, బలహీన, మైనార్టీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రభుత్వం ఆలోచన చేయాలి. మెదక్ నియోజకవర్గానికి కేటాయించి న్యాయం చేయాలి.

– సంగమేశ్వర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

రాజకీయాలు తగవు..



విద్యావ్యవస్థను ప్రభుత్వాలు రాజకీయ కోణంలో చూడకూడదు. కొన్ని నియోజకవర్గాల్లోనే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తే , మిగిలిన నియోజకవర్గాల విద్యార్థుల పరిస్థితి ఏమి టి. తొలి విడతలో దుబ్బాక నియోజకవర్గం లేకపోవడం బాధాకరం. విద్యార్థుల భవిష్యత్‌పై ఓటు రాజకీయాలు చేయడం హేయనీయం. దుబ్బాక చైతన్యవంతమైన ప్రాంతం. అన్యాయాలను ఈ ప్రాంతం సహించదు.

– గుడూరి వెంకటయ్య, రిటైర్డ్ ఎంఈవో దుబ్బాక

మెదక్ విద్యార్థులకు నష్టమే..



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పైలెట్ ప్రాజెక్టు కింద మెదక్ నియోజకవర్గాన్ని ఎంపిక చేస్తే బాగుండేది. ఈ ప్రాంతం చాలా వెనకబడింది. మెదక్ జిల్లాలో 40శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మెదక్‌లో నెలకొల్పితే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగేది. ప్రభుత్వం ఆలోచన చేయాలి.

– మల్లారెడ్డి,
పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మెదక్

వనదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాపన్నపేట, అక్టోబర్11: ఏడుపాయల వనదుర్గా భవాని మాత సన్నిధిలో శరన్నరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారిని సిద్ధిరాత్రి దేవిగా మోరున్ పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సకుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర పాఠశాల డైరెక్టర్ కృష్ణారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వనదుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ రాహుల్

సింగూరుకు తగ్గిన వరద

పుల్కల్,అక్టోబర్ 11: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు అప్రమత్తమై 6వ గేటు 1.50 మీటర్ల ఎత్తు లేపి 8142 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం వరకు వరద తగ్గడంతో ప్రాజెక్టు అధికారులు ఎత్తిన గేటును మళ్లీ మూసివేశారు.కా విద్యుదుత్పత్తి కోసం జెన్కోకు 2842 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా,ప్రస్తుతం 29.917 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఐతా అడ్వయిజర్‌గా సంతోష్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 11: ఆస్ట్రేలియా ఇండియా ట్రేడ్ అసోసియేషన్ (ఐతా) అడ్వయిజర్‌గా సౌత్ ఇండియా నుంచి ఏకె సంతోష్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ చైర్మన్ ఆశీష్ కట్టా ఉత్తర్వులు జారీ చేశారు. చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాధర్ రెండో కుమారుడు సంతోష్‌రావు ఉన్నత చదువులు చదివి ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌లోని బ్రిస్‌బెన్ సిటీలో స్థిరపడి వ్యాపారం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌రావు మాట్లాడుతూ..సౌత్ ఇండియా, ఆస్ట్రేలియాలో వ్యాపార అవకాశలపై మార్గనిర్దేశం చేస్తానని తెలిపారు. సౌత్ ఇండియా, ఆస్ట్రేలియాల మధ్య వ్యాపార సంబంధాలపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగ వాటాదారులతో పరస్పర చర్చలు జరిగేలా చూస్తానన్నారు. సంతోష్‌రావు నియామకంపై జిల్లా వ్యాపార వాణిజ్య సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

- సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు
- డిజిటల్ అరెస్టులతో అప్రమత్తంగా ఉండండి
- రాష్ట్రంలో ఆన్‌లైన్ మోసాల్లో అమీన్‌పూర్‌కు మూడో స్థానం
- హైడ్రా పేరుతో మోసాలకు పాల్పడితే ఊరుకోం
- మల్టీజోన్-2 ఐజీ డీ సత్యనారాయణ

అమీన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ, సంగారెడ్డి ఎస్పీ రూపేష్

పటాన్‌చెరు, అక్టోబర్ 11: శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారు ఎంతటివారైన కఠిన చర్యలు తీసుకుంటామని మల్టీజోన్-2 ఐజీ డి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన జిల్లా ఎస్పీ రూపేశ్‌తో కలసి తనిఖీ చేశారు. ఐజీ సత్యనారాయణను అమీన్‌పూర్ పోలీసులు గౌరవ వందనం అందజేసి స్వాగతం పలికారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మొక్క నాటారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన మినీ కమాండ్ కంట్రోల్‌ను ఐజీ ప్రారంభించారు. కొన్నేండ్లుగా అమీన్‌పూర్‌లో నమోదవుతున్న కేసులు, పరిష్కారవుతున్న విధానం, వేగంగా పెరుగుతున్న అర్బన్ అర్బనైజేషన్ ద్వారా ఉత్పన్నమవుతున్న కేసుల గురించి ఆరాతీసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. రిసెప్షన్‌లోప్రతి పిటిషన్‌ను ఆన్‌లైన్ చేయాలని, పోలీసు స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అనంతరం ఐజీ విలేకరులతో మాట్లాడారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశానని వివరించారు. సైబర్ నేరాల్లో అమీన్‌పూర్ మూడో స్థానంలో ఉందన్నారు. శరవేగంగా పట్టణీకరణ జరుగుతున్నందున సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బంది, ఉద్యోగులు, వ్యాపారులు ఇక్కడే నివసించేందుకు వస్తున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ మోసాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, కబ్జాలు, ప్రభుత్వ భూముల కబ్జాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. ఇతరుల స్థలాలను బలవంతంగా కబ్జాలకు పాల్పడితే పోలీసులు కఠినంగానే వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. సివిల్ వ్యవహారాల్లో పోలీసులు తలదూర్చరాదని, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, తదితర శాఖలతో కలసి ప్రభుత్వ స్థలాలను కాపాడే వ్యవస్థ ఉందన్నారు. హైడ్రా పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, వారిపై గట్టి నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే హైడ్రా పేరుతో మోసం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని ఐజీ సత్యనారాయణ గుర్తు చేశారు.

ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండండి..

ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని, డిజిటల్ అరెస్టులతోను అలర్ట్‌గా ఉండాలని ప్రజలకు ఐజీ సత్యనారాయణ సూచించారు. ఆన్‌లైన్‌లో లోన్లు తీసుకోవడం, బెట్టింగ్ యాప్స్‌లో డబ్బులు పెట్టడం చేయరాదన్నారు. ఎవరూ అయాచితంగా మనకు డబ్బులు ఇవ్వరని గుర్తించాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ప్రతిరోజు మోసాలకు పాల్పడుతున్నారని, వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబరాబాద్, రాచకొండ తరువాత అమీన్‌పూర్ లోనే ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో 122 సైబర్ కేసులు, 2023లో 158 కేసులు, 2024లో 178 కేసులు నమోదైనట్లు తెలిపారు. వెలుగు చూడని కేసులు అనేకం ఉంటాయన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైతే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అమీన్‌పూర్‌లో 46 కేసుల్లో తక్షణం స్పందించి బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు ఫ్రీజింగ్ చేశామన్నారు. అప్రమత్తతే మీకు మేలు చేస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో మోసాలపై ప్రజలకు అవగాహన పెంచుతున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని ఐజీ చెప్పారు. ఐజీ వెంట ఎస్పీ చెన్నూరి రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, ఎస్సైలు విజయ్, సోమేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

ప్రయాణ పాట్లు

విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా దసరా పండుగకు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. తెలంగాణలో పెద్ద పండుగైన విజయదశమికి ఆర్టీసీ సరిపడా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో సొంతూరికి చేరుకోవడానికి ప్రజలు తిప్పలు పడుతున్నారు. మహాలక్ష్మి పథకంలో అసలే ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఇప్పుడు పండుగ సందర్భంగా బస్సుల్లో ఫుల్ జనం ఎక్కుతున్నారు. దీంతో బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్నారు. ఆర్టీసీ బస్సులు సరిపడా నడవకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ఇంటికి చేరుకుంటున్నారు.

– సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 11